Blue Science Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue-2 (April-June),2025

భారత జాతీయోద్యమం - తెలుగు కవిత్వం

గంధం అశోక్ కుమార్,

పరిశోధక విద్యార్థి,తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప

Cell : 9542414559

GMail : ak5774747@gmail.com

పరిచయం :

భారతదేశం మూడు శతాబ్దాలపాటు పారతంత్ర్య కుతంత్రాల్లో అలమటించింది. బ్రిటీష్ వారి కుటిల దాస్య శృంఖలాల్లో చిక్కుకొని మగ్గింది. భారతీయులు స్వాతంత్ర్యరహిత జీవనాన్ని, బ్రిటిష్ వారి ధురాగతాలను భరించలేకపోయారు. గోపాలకృష్ణ గోఖలే, మహాత్మాగాంధీ, లాలాలజపతిరాయ్, భగత్ సింగ్, సుభాస్ చంద్రబోస్, జవహర్లాల్ నెహ్రూ, చంద్ర శేఖర్ ఆజాద్, దాదాభాయ్ నౌరోజీ, బిపిన్ చంద్రపాల్, సర్దార్ వల్లభాయ్ పటేల్, సరోజినీ నాయుడు, మెదలైన వారు స్వతంత్రం కోసం పోరాడి స్వాతంత్ర్య కాంక్షను ప్రజల్లో రగిల్చి ప్రజలను కూడా స్వాతంత్రంలో పాల్గొనేలా ఉత్తేజపూర్వక ఉపన్యాసాలు, రచనలు చేశారు. బ్రిటీష్ పాలకుల దమననీతిని ఖండిస్తూ, వారి పాలనకు చరమగీతం పాడేందుకు జాతీయోద్యమాన్ని నడిపారు.

జాతీయోద్యమం – తెలుగు కవిత్వ

జాతీయోద్యమ కాలంలో తెలుగు రచయితలు తమ సాహిత్యం ద్వారా ప్రజలను ఉత్తేజితులను చేస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేలా చేశారు. ప్రముఖ పాశ్చాత్య సాహితివేత్త షెల్లీ గారు 'సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని' అన్నట్లు అప్పటి బ్రిటిష్ పాలకుల దూరఘాతాలను తమ సాహిత్యం ద్వారా ప్రజలకు తెలియజేసి జైలు జీవితం గడిపిన కవులు కూడా ఉన్నారు. ''కవులు ఎన్నుకోబడని శాసనకర్తల వంటి వారన్న'' షెల్లీ అభిప్రాయం సత్యం. ఒక దేశాన్ని నిర్మించడంలో మహత్తరమైన పాత్ర పోషించే వారు కవులు. రూసో, వాల్టేర్‌ల సాహిత్యం ఫ్రెంచ్ విప్లవానికి దారితీసాయి. ఆ సంఘటనల స్ఫూర్తితో తెలుగు కవులు పరపాలనను పారద్రోలాలని, స్వాతంత్ర్యాన్ని సాధించాలనే కాంక్షను, ఆశయాన్ని ప్రజల్లో రగిలించడానికి తమ కలాలను కదిలించారు. తమ రచనల ద్వారా ప్రజల హృదయాల్లో జాతీయోద్యమ భావాలను మేల్కొలిపి స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిచేలా చేశారు.

బ్రిటిష్ వారు విభజించి పాలించే విధానంలో 1905లో బెంగాల్‌ను రెండు ముక్కలు చేయడంతో భారతీయుల గుండెలు భగ్గుమన్నాయి. ఆ ఘటనకు వ్యతిరేకంగా బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రముఖమైన పట్టణాల్లో పర్యటించి ప్రసంగాలు చేసి, ప్రజలను ఉత్తేజపరచి, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించాడు. అందులో భాగంగా ఆంధ్రదేశంలో మచిలీపట్టణం, విశాఖ పట్టణం,

Blue Science Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue-2 (April-June),2025

రాజమండ్రి వంటి పట్టణాల్లో ఉపన్యాసాలు చేశాడు. 1907వ సంవత్సరం ఏప్రిల్ నెల 5,6,7 తేదీల్లో రాజమండ్రి దగ్గర ప్రజలను ఉద్దేశించి ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను చేశాడు. ఆ ఉపన్యాసాలను ప్రముఖ తెలుగుకవి చిలకమర్తి ప్రజలకు అర్థవంతం కావడం కోసం తెలుగులో ఆయన ప్రసంగాన్ని అనువదించారు. చివరిరోజు సభలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ దోపిడీ విధానాన్ని, దురాగతాలను జాతీయతావాదాన్ని చైతన్య పరిచేలా ఆశువుగా

''భరత ఖండంబు చక్కని పాడి ఆవు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి'' అని చెప్పారు.

చిలకమర్తి పలుకులు అక్కడి ప్రజలకు ప్రముఖులకు అమృతపు గుళికల్లా ప్రజలను ఆకర్షించాయి. అందులో భారతమాతను పాడి ఆవుతో, భారతీయ సంపదను పాడి(పాలు)తో, హిందువులను లేగల(ఆవు దూడ)తో, వారనుభవించే కష్టాలను లేగదూడల ఏడ్పుతో పొలుస్తూ వర్ణించారు. తెల్లవారిని 'గడుసరి గొల్లవారు' అనడం వల్ల వారి ధూరగతాన్ని, నిర్దాక్షిణ్య , కాఠిన్యాలతో వ్యవహరించి, భారతదేశ సంపదను కొల్లగొట్టడాన్ని సూచించారు. మూతులు బిగియబట్టి అనే పదబంధం వల్ల సమకాలీన నిర్బంధ దుస్థితిని వ్యక్తపరచాడు. అప్పట్లో ఈ పద్యం తెలుగు ప్రజల నాలుకలపై మారుమోగింది. చిలకమర్తి పద్యాన్ని తెలుగులో తొలి జాతీయ కవితగా విమర్శకులు గుర్తించారు. బ్రిటిష్ వారు దమననీతితో, జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తులను జైల్లో పెట్టేవారు. చిలకమర్తి వారు కూడా కారాగారవాసాన్ని అనుభవించారు. తొలిజాతీయోద్యమకవిగా చిలకమర్తి ఎందరో కవులకు స్ఫూర్తిని కలిగించారు.

స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో ఉద్యమకారులు , ప్రజలు లాఠీల దెబ్బలను రుచిచూశారు. బూట్ల కాళ్ళతో తన్నినా, తుపాకీ మడమలతో బాదినా, జైలులోకి తోసినా ఎవ్వరూ వెనుకంజ వేయలేదు. పైగా ఉద్యమం మరింతగా వ్యాపించింది. లాలాలజపతిరాయ్ గారిని జైలులో నిర్బంధించినప్పుడు ఆంధ్రదేశంలో కూడా నిరసన ఉద్యమం పెల్లుబికింది. అప్పుడు చిలకమర్తి స్పందించి రాసిన పద్యాలలో మణిపూస ఇది-

"చెరసాలల్ పృథు చంద్రశాలలెయగున్, చేదోయిగీలించున
య్యెరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైనచోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చు నవ్వానికిన్"

ఈ పద్యం ఆవేశంతోపాటు అంకితస్వభావాన్ని పురికొల్పింది. ఆలంకారికంగా ఔచిత్య వంతమైన పద్యమిది. "ఈ పద్యములో జాతీయ భావస్ఫులింగములు చటపటలాడి పోవుట గమనింపదగినది. జాతీయభావమును వ్యంగ్యముగానో, అన్యాపదేశముగానో చిత్రించక, సూటిగా ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శించిన

Blue Science Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue-2 (April-June),2025

మొట్టమొదటి జాతీయకవి చిలకమర్తి వారే" అన్న సి. నారాయణరెడ్డిగారి మాటలు అక్షర సత్యాలు అనటం లో అతిశయోక్తి కాదు.

చిలకమర్తి గారికంటే ముందే 1905 డిసెంబర్ 15 నాటి కృష్ణ పత్రికలో 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' పేరుతో ఒక ప్రభోద గీతం వెలుబడింది. అది

'హిందువులారా, ఎన్నాళ్ళీ గతి
మందమతులరై మాటికిజెడెదరా
నందనులగు మీరందరూ స్రూక్కగ
యెందుకు నా బ్రతుకితరులకోసమ'

అంటూ సాగిన ఈ గీతం ఎవరు వ్రాసారో తెలియదు. రచయిత తెలియకపోయిన ఈ గీతం కూడా ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందింది. ఎన్నాళ్ళు ఇలాంటి గతి అంటూ ప్రజలను ప్రశ్నిస్తూ, ప్రజలలో చైతన్యం కలిగించింది.

జాతీయోద్యమ కవిత్వంలో మాతృస్తుతి - దేశసంస్తుతి ఒక భాగం. దేశాభిమానం ప్రజల్లో కలిగించటానికి దేశ వైభవాన్ని కీర్తించాలి. ఈ నేల, ఈ దేశం తమ 'జన్మభూమి' అన్న భావం ప్రజల నరనరాల్లో ప్రవహించడానికి ఈ కవిత్వం తోడ్పడింది. ఇందులో పూర్వవైభవ ప్రసక్తి ఉంటుంది. దేశభక్తి ఉండటం అంటే దైవభక్తి ఉండటమే అన్న సందేశం ఉంటుంది.

" నా మాతృ దేశమా!
నా ప్రాణ ప్రదము నా నాకలోకమా!
నా తపః ఫలము నా ప్రాణములకన్న నామేనికన్న
నతిగాఢముగ నిన్ను నాత్మ ప్రేమించు"

అంటూ మంగిపూడి 1911లోనే 'భారతమాత' అనే ఖండిక రాశారు. తమ ప్రాణాలకంటే తమ దేశాభిమానం మిన్న, దేశ ప్రేమ ఇందులో చూడవచ్చు.

గురజాడ వారి దేశభక్తి ఖండిక ఆయన అభ్యుదయ కాంక్షకు, విశాల దృష్టికి, జాతీయవాద దృక్పథానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రతీక వంటిది. ముత్యాలసరాల అనే పేరుతో సరళమైన పదాలతో గేయ చంధస్సుగా రచించి ప్రజలలో దేశభక్తి ప్రబోధం కలిగించారు. ఈ గేయం రవీంద్రనాథ్ ఠాగూర్ జనగణమన, బంకించంద్రుని వందేమాతరం వంటిదనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆ గీతాల్లో లేని విశాల విశ్వ మానవ దృక్పథం గురజాడ గేయంలో కనిపిస్తుంది. ఇందులో ఎక్కడా ప్రత్యేకించి ఏ ఒక్క దేశానికో లేక భారతదేశానికి మాత్రమే సంబంధించిన గేయం కాదు. ఏ దేశం వారికైనా దేశభక్తిని ప్రబోధించే విధంగాఉంటుంది. అందుకే ఇది విశ్వమానవ జాతీయగేయం అన్న సినారె అభిప్రాయం సమంజసంగా ఉంది.

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్న
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తల పెట్టవోయ్

Blue Science Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue-2 (April-June),2025

అంటూ సాగే ఈ గేయం ప్రజల్లో నిర్మాణాత్మకమైన గట్టిమేలు చేయడమే దేశాభిమానానికి నిజమైన నిదర్శనమని వట్టిమాటలు కాదన్న ప్రబోధం జాతీయోద్యమంలో ప్రజలను ప్రభావితం చేసింది.

రాయప్రోలు వారు భారత జాతీయాభిమాన స్ఫూర్తితో రచించిన జన్మభూమి గీతం

''ఏ దేశమేగినా ఎందు కాలిడిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము'' అంటూ జాతీయోద్యమ స్ఫోరకంగా దేశభక్తి తత్పరతను ప్రబోధించారు. జాతీయోద్యమం కాలంలో ఈ గీతం యువకుల్లో గొప్ప స్పందన కలిగించి బాగా ప్రచారం పొందింది. ఆంధ్రాభిమానంతో తొలిసారిగా తెనుగుతల్లి పదాన్ని ప్రయోగించింది కూడా రాయప్రోలు వారే. జాతీయోద్యమంలో ఆంధ్రులు సమైక్యంగా పోరాడాలన్న కాంక్షతో 1914లో ప్రబోధం ఖండిక రచించారు.

జాతీయ స్ఫూర్తిని మేల్కొల్పిన ప్రముఖులలో గరిమెళ్ళ సత్యనారాయణ ఒకరు, ఆయన తన శక్తివంతమైన సాహిత్యంతో ప్రజలలో శౌర్యాన్ని మరియు బలాన్ని రేకెత్తించింది. ఆయన ప్రసిద్ధ గేయం

మా కొద్దీ తెల్లదొరతనము దేవా
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే (మా కొద్దీ)

అంటూ సాగే ఈ గేయం ప్రజలలో గొప్ప ఉత్సాహాన్ని మరియు ధైర్యాన్ని రేకెత్తించింది. ఆ రోజుల్లో కోట్లాది తెలుగు ప్రజలకు ఇది వాస్తవంగా జాతీయ గీతంగా మారింది. మాతృదేశానికి నివాళులు అర్పించిన ఆయన ``దండాలు దండాలు భరత మాత" అంటూ ప్రజలలో అపారమైన ఉత్సాహాన్ని సృష్టించింది, లక్షలాది మంది జాతీయ ఉద్యమంలోకి పాల్గొనేలా దేశభక్తి ని నింపింది. గరిమెళ్ళ నిర్భయ జాతీయవాద కవిగా పేరొందారు. తన సాహిత్యానికి బ్రిటిష్ పాలకులచే జైలు శిక్ష అనుభవించిన మొదటి సాహితీవేత్తలలో ఒకరు. ఆ అల్లకల్లోల రోజుల్లో ఆయన జాతీయవాద కవిత్వానికి కొత్త ఒరవడిని సృష్టించారు. బ్రిటీష్ ప్రభుత్వ పాలనను గర్జిస్తు, తెల్లవారిని నిరసిస్తూ, ప్రజలను ప్రబోధిస్తూ, గేయాలు రాశారు. ఆయన గేయాల్లో ఆనాటి బ్రిటీష్ వారి దుండగాలను, దురాగతాలను కళ్లకు కట్టినట్లు వర్ణించారు

దండాలండోయ్/ మేముండలేమండోయ్ బాబు
ఉప్పు పన్ను, పప్పుపన్ను / ఊరికెళితే పన్ను
సైతాను ప్రభునిక / సాగనీయమండోయ్ బాబు''

అంటూ తెల్లవారి పాలనలో ప్రజలకు కలిగిన బాధలను హృదయవిదారకంగా వర్ణించి, నిరసించారు. సైతాను ప్రభుతలోని ''సైతాను'' పదప్రయోగం అప్పటి బ్రిటీస్ ప్రభుత్వ దుర్మార్గాన్ని సూచిస్తుంది. ఈ గేయం ఆనాడు గొప్ప ప్రచారంతో పాటు, గాంధీజీ మెప్పు పొందింది.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి 'వీరగంధం తెచ్చినారము / వీరులెవ్వరో తెలుపుడి'' అనే గీతం ద్వారా ప్రజల్లో వీరత్వాన్ని ప్రదీప్తం చేశాడు. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి ''అంటరానివారెవ్వరు / మా వెంట రాని వారే''

Blue Science Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 5.446(SJIF) Vol-2,Issue-2 (April-June),2025

అంటూ అధిక్షేపాత్మకంగా ప్రబోధించారు. తెలుగు కవులంతా ప్రజలను జాగృతం చేశారు.

ముగింపు :

భారతదేశం సుమారుగా 300 సంవత్సరాల పాటు బ్రిటిష్ వాళ్ళ చేతిలో చాలా అవమానాలకు గురైయ్యారు.భారతదేశం స్వాతంత్రం లేని జీవనాన్ని బ్రిటిష్ వారి దుర్మార్గాలను ఎదురించిలేక పోయారు. దీనికి వ్యతిరేకంగా కొంత మంది జాతీయోద్యమకారులు పోరాడి వారి కవిత్వాల ద్వారా ప్రజల్లో స్ఫూర్తినినింపేలా కవిత్వాలు రాశారు. అందులో ముఖ్యమైన వారు రాయప్రోలు, గురజాడ, గరిమెల్ల, చిలకమర్తి, మొదలైన వారు ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి, ప్రజలు ఆంగ్లేయుల చేతుల్లో పడుతున్న కష్ట,నష్టాల నుండి బయటపడే మార్గాన్ని చూపడానికి వీరు రాసిన కవిత్వాల ద్వారా ఉద్యమాలలో ఎలా పోరాడాలో ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారు. మన భారతదేశ చరిత్ర ఎంత గొప్పదో దాని గురించి తెలుపుతూ ఆ గొప్పతనాన్ని మనం కాపాడుకోవాలి అని కవులు కవిత్వాల ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగింది. జాతీయోద్యమానికి అనుగుణంగా ఉండే కవిత్వాలను ప్రజలకు అర్థం అయ్యో రీతిలోతెలిపి వారికి భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు.

ఉపయుక్త గ్రంధ సూచీ :

తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
.తెలుగులో జాతీయోద్యమం – కవిత్వం - డా. మద్దూరి సుబ్బారెడ్డి
తెలుగులో ఉద్యమ గీతాలు – యస్ వి సత్యనారాయణ
ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు - ప్రయోగములు – సి. నా. రె